ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు ఆదివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 208 మందికి 202 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం ఎలాంటి పరీక్షలు జరగలేదు.

మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పరీక్షలకు మొత్తం 384 మందికి 330 మంది హాజరు కాగా 54 మంది గైర్హాజరయ్యారు. ఇందులో సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 156 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 204 మందికి 174 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఎలాంటి పరీక్షలు జరగలేదు.

అమ్మో ఇంజినీరింగ్ సీటా..

చాలా ఖరీదే..!

- ఇఎపి సెట్ ర్యాంకులతో సంబంధం లేకుండా పెద్దఎత్తున డొనేషన్ సీట్ల కేటాయింపు
- డొనేషన్ కింద రూ.రెండు నుంచి రూ.ఐదు లక్షల వరకూ వసూలు
- ట్యూషన్ ఫీజు సైతం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికమే
- హాస్టల్ ఫీజు రూ.80 వేల నుంచి రూ.లక్షన్నర
- లోపాల పుట్టగా ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50కుపైగా ఇంజినీరింగ్ కాలేజీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంటర్ పూర్తయిన తర్వాత ఇంజినీరింగ్ చదవాలనుకునే విద్యార్థులకు ఫీజుల భారం భరించలేని స్థాయికి చేరింది. ఎపి ఇఎపి సెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్నా, లేకున్నా ఏడాదికి రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇంజినీరింగ్ చదవించే విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఎపి ఇఎపి సెట్‌లో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థికి ఏడాదికి రూ.రెండు లక్షల వరకూ ఖర్చవుతుండగా, ర్యాంకుతో సంబంధం లేకుండా ఇంజినీరింగ్ కాలేజీల్లో కేటాయిస్తున్న సీట్లకు బ్రాంచ్‌ను బట్టి రూ.మూడు లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో మొత్తం 506 వరకూ ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50కు పైగా ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ప్రతి కాలేజీలోనూ తక్కువగా లెక్కించిన అన్ని బ్రాంచీలకు సంబంధించి 300కుపైగా సీట్లు ఉంటున్నాయి. ఈ ప్రకారం చూస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే ప్రతియేటా 20 వేల మందికిపైగా విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి ఇంజినీరింగ్ కాలేజీలోనూ సిఎస్‌ఇ, ఇసిఇ, ఇఇఇ, సివిల్, మెకానికల్, కెమికల్ కోర్సులతోపాటు, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులు వచ్చాయి. ఇంజినీరింగ్ కాలేజీ ట్యూషన్ ఫీజులను ప్రభుత్వం రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ నిర్ణయించింది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు ఇతర ఫీజులతో మొత్తంగా ఏడాదికి రెండున్నర లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎంసెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా కాలేజీలు సీట్లు కేటాయిస్తున్నాయి. ఈ సీట్లకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. సిఎస్‌ఇ సీటుకు డోనేషన్ కింద రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షలు వసూలు చేయడంతోపాటు ప్రతియేటా రూ.లక్షా 50 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఓ మోస్తరు ఇంజినీరింగ్ కాలేజీలో సైతం డోనేషన్ సీటుకు రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. డొనేషన్ సీట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి పర్యవేక్షణా లేకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. డొనేషన్ సీటులో ఇంజినీరింగ్ నాలుగేళ్లు పూర్తి చేయాలంటే కనీసంగా రూ.15 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎపి ఇఎపిసెట్ ర్యాంకు తెచ్చుకుని ఇంజినీరింగ్ పూర్తి చేసినా రూ.ఆరు లక్షలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమ పిల్లలను ఇంజినీరింగ్ చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కష్టాలు వర్ణనాతీతం

ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ లోపాల పుట్టగా మారింది. గత ప్రభుత్వం నేరుగా విద్యార్థి, తల్లి ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ చేసింది. దీంతో ప్రభుత్వం ఇచ్చినా, ఇవ్వకపోయినా కాలేజీ యాజమాన్యాలు ముందుగానే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసేవి. అప్పులు తెచ్చి ఫీజు కట్టిన తర్వాత ఎప్పటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజుల బకాయిలను కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో తల్లిదండ్రులు అప్పులు తెచ్చి మరీ చెల్లించారు. వీటికి వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములను సకాలంలో చెల్లించకపోవడంతో తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. తమ పిల్లలను ఇంజినీరింగ్ చదివించాలని ఆశ పడుతున్న తల్లిదండ్రులు ఫీజుల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఆర్థికంగా భారంగా మారింది.

ముట్టడిలో నినదిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ నేతలు

బదిలీల్లో సమస్యలను పరిష్కరించాలి

- ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి లోకేష్ చర్చించాలి
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి
- ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యాశాఖలో బదిలీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు తాజాగా బదిలీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే డిమాండ్లతో స్థానిక డిఇఒ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. ముట్టడికి యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి గోపీమూర్తి ఉపాధ్యాయులకు మద్దతు తెలిపి మాట్లాడారు. మే 19, 20 తేదీల్లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, దానికి భిన్నంగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను ఎనేబుల్ చేయడాన్ని ఖండించారు. ఇది ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. గతంలో జరిగిన పరిణామాలు, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెంచుతున్న వెబ్ ఆప్షన్ల పద్ధతిని విడనాడాలని హితవు పలికారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన వెబ్ కౌన్సిలింగ్లో కూడా అనేక సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారన్నారు. వేలాదిగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు కూడా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే దాదాపు రెండు వేల స్కూళ్లకు ప్రయారిటీ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, ఇది తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిందని, అందుకే ఆ ప్రయత్నాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సమస్యలను తెలియజేశారు. బదిలీల ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం ప్రతి జిల్లా నుండి ఇద్దరు ప్రతినిధులతో సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయాలని, వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని, అవసరమైన మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేగవంతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఎపిటిఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్, పిఆర్‌టియు అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు, పిఇటిల అసోసియేషన్ నాయకులు రమేష్‌తోపాటు ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది పైబడి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఎపి ఇఎపి సెట్‌లో పాలకొల్లు సాత్విక్‌కు 3వ ర్యాంక్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఎపి ఇఎపిసెట్-2025లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. సాత్విక్ రాజమండ్రి తిరుమల విద్యాసంస్థల్లో చదువుతున్నాడు. సాత్విక్ తండ్రి వెంకట సత్యనారాయణ కౌలు రైతు. తల్లి గీతావాణి గృహిణి. సత్యనారాయణ దంపతుల పెద్ద కుమారుడు తరుణ్ సాయితేజ్ ఇటీవల ఎన్ఐటి భోపాల్‌లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి రాజస్థాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు బాలసూర్య నాగేశ్వర్ ఎన్ఐటి అగర్తాలలో ఇఇఇ చేస్తున్నాడు. మూడో కుమారుడైన సాత్విక్ ఇప్పుడు 94.75 శాతం మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు సాధించాడు.

రోజుకు పది గంటలు సాధన చేశా

తాను ప్రతిరోజూ పది గంటలు సాధన చేశానని యశ్వంత్ సాత్విక్ తెలిపారు. ఫలితంగా స్టేట్ ర్యాంకు సాధించానని చెప్పారు. ముంబైలోని ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేయాలన్నది తన కోరికని తెలిపారు.

నేడు కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం జిల్లా కేంద్రమైన ఏలూరులోని కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు డిఆర్ఒ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల పిజిఆర్ఎస్ నిర్వహించడం లేదని, జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అగ్రికల్చర్, ఫార్మాలో సత్యవెంకట్‌కు ఐదో ర్యాంకు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడేనికి చెందిన యలమోలు సత్య వెంకట్ ఎపిఇఎపి సెట్‌లో అగ్రికల్చరల్, ఫార్మా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించాడు. సత్య వెంకట్ వేలివెన్ను శశి జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపిసి చదివాడు. సత్య వెంకట్ తండ్రి రామకృష్ణ, తల్లి సుచరిత ఇద్దరు డాక్టర్లే. తాడేపల్లిగూడెం భూపాల్‌నగర్‌లో శ్రేయాస్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ అండ్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సత్య వెంకట్ రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించడం తమకు చాలా గర్వకారణంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. సత్య వెంకట్ మెడిసిన్ చేయనున్నట్లు చెప్పారు. వెంకట్ నీట్ పరీక్ష కూడా రాశాడన్నారు. రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించిన సత్యవెంకట్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి నాగరాణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి నాగరాణి తెలిపారు. అలాగే విద్యార్థుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపిన ఆమెతో ప్రజాశక్తి ముఖాముఖి.

ప్రశ్న : జిల్లాలోని బిసి సంక్షేమ శాఖ ఎటువంటి విధులు నిర్వహిస్తుంది?

అధికారి : సంక్షేమ శాఖలో మొదటగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ అని రెండు రకాలు ఉంటాయి. ప్రీ మెట్రిక్ అంటే మూడో తరగతి నుంచి పదో తరగతి లోపు, పోస్టుమెట్రిక్ అంటే ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు ఉంటుంది. వీరిలో బిలో పావర్టీ లైన్‌కు ఎవరైతే దిగువన ఉన్నారో వారికి హాస్టల్ సౌకర్యం కల్పించి, దానికి సంబంధించిన పాఠశాలలకు పంపిస్తాం. వసతి గృహంలో ఒక హాస్టల్ వార్డెన్, ముగ్గురు వర్కర్స్, ట్యూటర్స్‌ను పెట్టి వారిని చక్కగా చదివిస్తాం. మెనూ ప్రకారం మంచి భోజనం పెట్టి, వారిని బాగా చదివించి, ప్రయోజకులను చేయడమే దీని లక్ష్యం.

ప్రశ్న : 2024-25 విద్యాసంవత్సరంలో బిసి స్టడీ సర్కిల్స్‌లో చదువుకునే పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎంత?

అధికారి: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బిసి హాస్టల్స్‌లో 216 మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారు.

ప్రశ్న : బిసి హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ మెనూ ఏ విధంగా అందిస్తున్నారు?

అధికారి : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతిరోజూ పాలు, గుడ్డు, పప్పు, ఆకుకూర, కూరగాయలు, పండ్లు, చిక్కిలు, రోజుకో రకం స్నాక్స్‌తో కూడిన మంచి భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. ప్రీ మెట్రిక్ హాస్టల్లో వారంలో మూడుసార్లు చికెన్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో వారంలో రెండుసార్లు చికెన్ అందిస్తున్నాం.

ప్రశ్న : విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : ప్రతి నెలా ప్రతి వసతి గృహంలో ఉండే ప్రతి విద్యార్థికీ ఆరోగ్య పరీక్షలు దగ్గరలో ఉన్న పిహెచ్‌సి డాక్టర్లతో చేయిస్తున్నాం. తాగడానికి వేడి నీటిని అందిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూసుకుంటున్నాం.

ప్రశ్న : విద్యార్థుల ప్రవర్తన, విద్య విషయాలను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారా?

అధికారి : ప్రతినెల ప్రతి వసతిగృహంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి విద్యార్థుల మెనూ, ప్రవర్తన, చదువు తదితర విషయాలపై చర్చిస్తున్నాం.

ప్రశ్న : జిల్లాలో కొన్ని బిసి హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వం వారు ఏమైనా నిధులు మంజూరు చేశారా?

అధికారి : వసతి గృహాల భవనాలు కొన్ని శిథిలావస్థలో ఉన్నా యి. వాటి మరమ్మతుల విషయాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్న ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల డిపార్ట్ మెంట్స్ దృష్టికి తీసుకెళ్లాం. వారి ద్వారా వచ్చిన ఎస్టిమేషన్సు సుమారు రూ.మూడు కోట్ల నిధులు కోసం డైరెక్టర్‌కు అర్జీ పెట్టాం. ఆ నిధులు మంజూరైన వెంటనే ఎక్కడైతే భవనాలు శిథిలావస్థకు చేరాయో వాటికి మరమ్మతులు చేయిస్తాం. విద్యార్థులకు సదుపాయాల కోసం, నీటి కొరత లేకుండా, టాయిలెట్స్ ఇబ్బంది లేకుండా ఒక్కో వసతిగృహంలో రూ.1.50 లక్షలతో బాగు చేయించాం. పిల్లలు ఉండే వసతి గృహాల గదులు, హాస్టల్‌లోని మరగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకుంటున్నాం. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పిల్లలు ఉండే ప్రిమిసెస్‌లో మొక్కలు నాటడం వంటివి చేస్తున్నాం.

ప్రశ్న : విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

అధికారి : విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం కాలేజీ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీ వారు కన్ఫమ్ చేసిన వెంటనే మా వద్దకు వస్తుంది. మేము కన్ఫమ్ చేసిన వెంటనే నోడల్ అధికారి ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందుతాయి.

ప్రశ్న : జిల్లాలోని హాస్టల్స్‌లో హాస్టల్ వార్డెన్ సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

అధికారి : హాస్టల్ వార్డెన్ సిబ్బంది కొరత, క్లాస్ 4 సిబ్బంది కొరత లేదు. ఎటువంటి ఇబ్బంది లేదు.

ప్రశ్న : బాలికల హాస్టల్‌లో విద్యార్థుల భద్రత కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: ఆడపిల్లలు ఎవరైనా బయటకు వెళ్లాలంటే ఒక ఎస్కార్ట్‌ని ఇచ్చి పంపించి మళ్లీ తీసుకొస్తున్నాం. పిల్లలు స్కూల్‌కు వెళ్లి సమ యానికి వస్తున్నారా లేదా అనేది కూడా పర్యవేక్షిస్తున్నాం. వారికి ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలు ఉన్నా సిబ్బంది ఆసుపత్రికి తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సిఇఒ సమావేశంలో కూడా బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని కోరాం. ఆ సదుపాయం కల్పిస్తే ఇంకా బాగుంటుంది. బాలికల వసతిగృహాల్లో ఉన్న ఏరియాలో పోలీస్ పికెటింగ్ పెట్టాలని కోరాం. అవి కూడా జరుగుతున్నాయి. విద్యార్థులు కాలేజీలకు వెళ్లి వచ్చేటప్పుడు కూడా ఎస్కార్ట్ ఎప్పుడు వారితోనే ఉంటారు.

ప్రశ్న : మీరు జిల్లాలోని వసతిగృహాలను నెలలో ఎన్ని సార్లు తనిఖీ చేస్తున్నారు?

అధికారి : మేము నెలలో దాదాపుగా పది వసతిగృహాలను తనిఖీ చేయాలి. కానీ నేను 15 నుంచి 20 వసతిగృహాలను తనిఖీ చేస్తుంటాను. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అనేది ఎప్పుడూ పర్యవేక్షిస్తూ ఉంటాను.

మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

హాజరైన జనం, కార్మికులు

అభివృద్ధిలో శ్రమ పాత్రే కీలకం

సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ

వార్త మెయిన్‌లో...

డ్రగ్స్‌రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపు
- నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహనలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఈ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఆశ్రం ఆసుపత్రిలోని క్రీడామైదానంలో బహుమతులను కలెక్టర్, ఎస్‌పి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్‌కు బానిసలు కాకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైన సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారి తీస్తాయన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని 1972, 14446 టోల్‌ఫ్రీ నెంబర్లకు తెలియజేయవచ్చన్నారు. విద్యతోపాటు క్రీడలకూ యువత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల కారణంగా శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, అంతేకాక డ్రగ్స్ వంటి దుర్వ్యసనాలకు లోను కాకుండా ఉండేందుకు దోహదపడతాయని అన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమస్య పరిష్కారానికి ప్రతిఒక్కరిలో చైతన్యం రావాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం కారణంగా నేరాల రేటు పెరుగుదలకు దారి తీస్తుందని, అంతేకాకుండా సమాజం మొత్తం మీద హానికరమైన ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి బహుముఖ ఉద్యమం చేపట్టాల్సి ఉందన్నారు. యువత మాదకద్రవ్యాల జోలికెళ్లకుండా చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయడానికి, వాటి వినియోగం నివారించడానికి 'ఈగల్' టీమ్‌లు, పోలీసు శాఖ సంయుక్తంగా పలు కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, తద్వారా జీవితంలో ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోగలిగే ఆత్మస్థైర్యం కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీల్లో మొదటి స్థానం పొందిన పోలీసు టీమ్, రెండోస్థానం పొందిన జ్యూడిషియల్ టీమ్, మూడో స్థానం పొందిన రెవెన్యూ టీమ్ క్రీడాకారులకు బహుమతులను కలెక్టర్, ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి వి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

బహుమతులను అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నేడు ఏలూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

33 కెవి ఏలూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేసేందుకు ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్.అంబేద్కర్ కెఎం.అంబేద్కర్ తెలిపారు. ఆ సమయంలో పవర్‌పేట, పాత బస్టాండ్, గూడ్స్ షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్, వైఎంహెచ్ఎ హాల్, మెయిన్ బజార్, చందన బ్రదర్స్ రోడ్, తూర్పు వీధి, పడమర వీధి, దక్షిణపు వీధి, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత
- ఆసుపత్రికి తరలింపు
- పోతనపల్లిలో ఘటన

ప్రజాశక్తి - చాట్రాయి

పిడుగుపాటుకు ఒక మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు ఆ పిడుగు ధాటిని తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మండలంలోని పోతనపల్లి ఆదివారం చోటు చేసుకుంది. మండలంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పోతనపల్లిలో పొలాల్లో పశువులు మేపేందుకు వెళ్లిన నలుగురు వర్షం రావడంతో ఒక చెట్టు కిందకు వెళ్లారు. ఆ చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న నలుగురిలో ఒక మహిళ అబ్బదాసరి శాంతకుమారి (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు వ్యక్తులు కంచర్ల ఇశ్రాయేలు, పంచిగోళ్ల వెంకీ, కొమరవరపు రమేష్ ఆ పిడుగు ధాటికి షాక్‌కు గురై అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానికులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త చినపీరయ్య, వివాహితురాలైన కుమార్తె స్వప్న ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఘటనతో పోతనపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా : రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆయిల్‌పామ్ రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ, కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై పది శాతం దిగుమతి సుంకం తగ్గించడంపై నిరసనగా ఈనెల తొమ్మిదో తేదీ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆయిల్ పామ్ రైతులు చేపట్టిన ధర్నా, కలెక్టర్‌కు ఆయిల్ పామ్ రైతుల సామూహిక రాయబార కార్యక్రమం విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ముడి పామాయిల్ దిగుమతి సుంకం పది శాతం తగ్గించడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.22 వేల ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని కోరారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేట్ పరం చేయాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. పెదవేగిలో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఏలూరు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మండవల్లి

అరేయ్ ప్రకాష్ ఎన్నాళ్లయింది నిన్ను చూసి ఎక్కడుంటున్నావ్? ఎలా ఉంటున్నావ్ రా.. లక్ష్మి ఎన్నాళ్లకు కనిపించవే.. అంతా కుశలమేనా పిల్లలు ఏం చేస్తున్నారే అంటూ ఆత్మీయ పలకరింపులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1990-91 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల వయస్సు పైబడినప్పటికీ ఎండ తీవ్రత అత్యధికంగా ఉన్నా లెక్కచేయకుండా చిన్నప్పటి తన తోటి మిత్రులను మిత్రురాళ్లను కలిసిన ఆనందంలో మైమరచిపోయి రోజంతా హాయిగా ఆహ్లాదంగా గడిపారు. కుటుంబాల్లోని వ్యక్తులను పరిచయం చేసుకుంటూ ఒకరినొకరు పిల్లల యోగక్షేమాలను తెలుసుకుని ఆనంద డోలికల్లో తెలియాడారు. ఆనాడు విద్య నేర్పిన ఉపాధ్యాయులు భాస్కరరావు, కనకమహాలక్ష్మి, బుజ్జి, సూర్యారావు, తదితర ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి వారిని దుశ్శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం ఆర్‌సిఎం పాఠశాల లో 2001-2002 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను కలుసకుని వారిని మెమెంటో, శాలువలతో సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, కుమార్, రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, ప్రభావతితో పాటు పూర్వ విద్యార్థులు రాంబాబు, ధర్మ, మధు, పావని, శేషు, భూషణం, అంబేద్కర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

గుణ్ణం రామచంద్రరావు వర్ధంతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మాజీ సర్పంచి గుణ్ణం రామచంద్రరావు 15వ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబసభ్యులు, గ్రామసులు, యువత, మానవత సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన 1981 నుంచి 1995 వరకు సర్పంచిగా సుదీర్ఘకాలం పాటు గ్రామానికి సేవలందించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామసులు రామచంద్రరావు సేవలను స్మరిస్తూ పంచాయతీ కార్యాలయం, ఎస్‌సి పేటలో ఆయన విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

గొల్లగూడెంలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గొల్లగూడెంలో టిడిపి కార్యాలయాన్ని ఆప్కాబ్ చైర్మన్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్ ఆధ్వర్యంలో గొల్లగూడెం గ్రామ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమని కార్యకర్తలు, నాయకులు అన్నారు. గొల్లగూడెంతో సహా మెట్ట ప్రాంత గ్రామాలకు ఈ కార్యాలయం అనువుగా ఉంటుందన్నారు. గ్రామ సర్పంచి కరప వెంకట శ్రీనివాస్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని కన్నాయిగుట్టలో స్కీమ్ వర్కర్ల మండల సదస్సును వెంకటేశ్వరమ్మ, రేవతిల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కీమ్ వర్కర్ల రాష్ట్ర నాయకురాలు జె.లలిత, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, బుచ్చిబాబు, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ (ఎఐటియుసి) అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజమ్మ, ఎఐటియుసి మండల కార్యదర్శి కారం ధారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళలు, స్కూల్ స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలన్నారు. అనంతరం స్కీమ్ వర్కర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరి, పి.రమ, ఎన్.వెంకమ్మ, పి.లీలావతి, భద్రమ్మ, నాగమణి, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, యమున, సీత శ్రీకాంత, శారద, వేణు చిన్నమ్మి, తదితరులు పాల్గొన్నారు.

'యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆరోగ్యహితమైన యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని శ్రీశ్రీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగా మెడిటేషన్ సెంటర్, టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ ట్రైనర్లు అక్కడకు విచ్చేసిన వారితో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబిఎస్.శర్మ, బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ నిర్వాహకులు, రాజయోగిని బికె.లావణ్య, టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపకులు శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

10న యోగా డే

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల పదో తేదీన యోగా డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జంగారెడ్డిగూడెం వాకర్స్ కులం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌డిఒ, తహాశీల్దార్, డిఎస్‌పి హాజరవుతారని తెలిపారు. యోగా డేకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో స్నానానికి దిగి యువకుడు మృతి

వేలేరుపాడు రూరల్ : చాగరపల్లి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యుడు మోతుకు రాంబాబు కుమారుడు చరణ్ గోదావరిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. కుక్కునూరు మండలం మాధవరం గ్రామంలో స్నేహితుడి వివాహ వేడుకకు శనివారం ముగ్గురు స్నేహితులతో కలిసి వెళ్లిన చరణ్ భోజనం అనంతరం అక్కడ మరో నలుగురు స్నేహితులతో కలిసి కౌండిన్య ముక్తేశ్వర స్వామి ఆలయ సమీపంలో గోదావరిలో స్నానానికి వెళ్లారు. అక్కడ స్నానం చేస్తుండగా చరణ్ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్, సభ్యులు చాగరపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం ఫ్రెండ్స్ ఆటో యూనియన్ తరపున రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా కుటుంబ సభ్యులుగా తాము తోడుంటామని చెప్పారు. ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కురుమళ్ల శ్రీను, కమ్మసిచ్చు రమేష్, బీరం అంజి, కాకాని శ్రీను, రమేష్, మజ్జి శ్రీను, మేకల పాంచాటా, లక్ష్మణ్, తదితర యూనియన్ సభ్యులు ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీని అభివృద్ధి చేయడమే లక్ష్యమని కమిషనర్ రాంబాబు చెప్పారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సహకారంతో జిల్లాలో చింతలపూడి నగర పంచాయతీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇందుకు ప్రజల సహకారం కావాలని ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో పారిశుధ్యం మెరుగుదలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్ : చింతలపూడి నగర పంచాయతీ ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రతిరోజూ కార్మికులతో శానిటేషన్ చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నాం. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. చింతలపూడిలో ఉన్న కిరాణా దుకాణదారులు చెత్తను రోడ్డు మీద వేయొద్దు.

ప్రశ్న : చింతలపూడి సెంట్రల్ లైటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది?

కమిషనర్ : చింతలపూడి నగర పంచాయతీ ప్రజల చిరకాల కోరిక చింతలపూడి సెంట్రింగ్ లైటింగ్ త్వరగానే పూర్తి చేస్తున్నాం. దీనిపై చింతలపూడి ఎంఎల్ఎ ప్రత్యేక దృష్టి సారించారు. నగర పంచాయతీలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు?

కమిషనర్ : చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ నగర పంచాయతీకి కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి చర్చించి అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టనున్నారు? నిధుల కోసం ఏవిధమైన కృషి చేస్తున్నారు?

కమిషనర్ : రోడ్ల నిర్మాణం కోసం రూ.40 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. అమృత్ సర్ 2.0లో భాగంగా రూ.40 లక్షలతో ప్రతి ఇంటికీ కుళాయి పంపు ఏర్పాటు చేస్తాం. మినీ బైపాస్ రోడ్డుకు రూ.30 లక్షలు చింతలపూడి చెరువు పార్కుకు రూ.40 లక్షలు, ఘంటావారి వీధి రోడ్డుకు ప్రత్యేక నిధులు, చింతలపూడి నగర పంచాయతీలో నాగిరెడ్డిగూడెం, ఘంటావారివీధికి, బిటి రోడ్డుకు రూ.మూడు కోట్లకు ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో సిబ్బంది కొరతను ఏ విధంగా అధిగమిస్తారు?

ప్రస్తుతం అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ బదిలీల్లో చింతలపూడి నగర పంచాయతీలో సిబ్బంది కొరత సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీ ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

కమిషనర్ : నగర పంచాయతీ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా మా దృష్టిలో పెట్టండి. నగర పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం కావాలి. అభివృద్ధే నా లక్ష్యం.

దేదీప్య సాయికి 358వ ర్యాంక్

నూజివీడు టౌన్ : పట్టణంలోని శ్రీ శారద జూనియర్ కళాశాల విద్యార్థి దేదీప్య సాయి ఎంసెట్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి 358 ర్యాంకు సాధించారని ఆ కళాశాల ఛైర్మన్ కె.శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా దేదీప్య సాయి మాట్లాడుతూ శ్రీ శారద జూనియర్ కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు దేదీప్య సాయి తెలిపారు.

శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ర్యాంకుల హవా

పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఇంజినీరింగ్ విభాగంలో ఇంటర్మీడియట్ చదివిన ఎ.మధునయ్ ఎంసెట్ ఫలితాల్లో 1975వ ర్యాంకు, తాడేపల్లి సాయి మాధురి 4884 ర్యాంకు సాధించి పట్టణ ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు తెలిపారు.

ఈదురుగాలులు, భారీ వర్షం

విద్యుత్ తీగలపై చెట్లు పడి నిలిచిన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బలంగా వీచిన ఈదురు గాలులకు మండలంలోని లోపూడి గ్రామంలో విద్యుత్ స్తంభంపై తాటిచెట్టు పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. వెంటనే స్థానిక నాయకులు, విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ స్తంభంపై పడిన తాటిచెట్టుకు పక్కకు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

తీగలపై చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.కిషోర్‌కుమార్ తెలిపారు. ఎల్.వరుణ్‌సందేశ్, జె.దయా సాగర్, పి.బాలవంశీ, బి.గుణరత్నలు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను రిటైర్డ్ ప్రిన్సిపల్ బిఎస్‌ఎన్.శంకరరావు, పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

చింతలపూడి : స్థానిక చింతలపూడి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నలుగురు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎం.వరలక్ష్మి ప్రసన్న తెలిపారు. వి.హర్షితారాణి, సిహెచ్.గాయత్రి, ఎం.సంధ్య, జె.వేదశ్రీలను ఎజిఎం పార్థసారథి, ఆర్ఐ ఉదయభాస్కర్, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎఒ రవీంద్ర, డీన్ ఎస్.చెన్నకేశవ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి మధు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చాట్రాయి : షైనింగ్ స్టార్ అవార్డుకు మండలంలోని పలు పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. చాట్రాయి వికాస్ హైస్కూల్ విద్యార్థులు అందే అక్షయ, తోకల సాయిమల్లికావాసంతి, బాణావతు రాజకుమార్, చిన్నంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పరస రేవతి, చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కంబాల వెంకట నాగ త్రివేణి, చనుబండ ఉషోదయ హైస్కూల్ విద్యార్థి కోపూరు తిరుపతిరావు ఎంపికయ్యారని ఎంఇఒ వివిఎస్‌వి.బ్రహ్మాచారి తెలిపారు.

నేడు షైనింగ్ స్టార్ అవార్డులు అందజేత

ముసునూరు : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు ప్రశంసాపత్రాలను అందిస్తున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి, గుడిపాడు, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు అందించనున్నట్లు చెప్పారు. షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు వారి తల్లితండ్రులతో హాజరు కావాలని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన : ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశకి - ఏలూరు

కేంద్రం రద్దు చేసిన కార్మిక చట్టాల్లో రెండు జర్నలిస్టులకు సంబంధించిన చట్టాలున్నాయని, వాటిని యథాతథంగా కొనసాగించాలని ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) డిమాండ్ చేస్తుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టినట్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డి.జబీర్, కార్యదర్శి హరీష్ తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నల్ల రిబ్బన్లు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న నిరసనకు జిల్లాలోని ఫెడరేషన్ బాధ్యులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు ఇతర బాధ్యులు జిల్లా నాయకులు తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్ట్‌ల ఐక్యత తెలియజేయటం ద్వారా త్వరలో ఇవ్వనున్న అక్రిటిడేషన్ విషయంలోను మేలు జరుగుతుందని తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫార్సు

ప్రజాశకి - భీమడోలు

ప్రయోగశాలల ఫలితాలు నేరుగా రైతులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత కృషి అభియాన్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్త డాక్టర్ వి.విజయలక్ష్మి, ఏరువాక కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ బి.భూచంద్రుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భీమడోలులోని రైతు సేవా కేంద్రం-1 వద్ద అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఎరువుల వాడకాన్ని క్రమబద్ధీకరించే క్రమంలో ప్రభుత్వాలు గతం కన్నా భిన్నంగా భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల విడుదలకు సిఫార్సు చేయమన్నాయన్నారు. గతంలో పంట విస్తీర్ణం ఆధారంగా ఎరువుల విడుదలకు చర్యలు తీసుకునే వారని, ఇకనుంచి దాని స్థానంలో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు సిఫార్సు చేస్తారన్నారు. దీనికోసం గత మూడు నాలుగేళ్ల కాలంగా విడుదలైన భూసార పరీక్షలను ప్రాతిపదికన తీసుకుంటారన్నారు. తాజాగా తీసుకున్నవాటికి సైతం సదరు సిఫార్సులు వర్తిస్తాయన్నారు. భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ పంట మార్పిడి విధానం వల్ల రైతులకు ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేయాలని సూచించారు.

ఘనంగా పివి.సునీల్‌కుమార్ పుట్టినరోజు

చింతలపూడి : దళితులకు రాజ్యాధికారం పివి.సునీల్‌కుమార్ చేస్తున్న పోరాటం ద్వారానే సాధ్యమవుతుందని దళిత బహుజన నాయకులు, అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు కాకర్ల సత్యం, గొంది రాజు అన్నారు. పివి.సునీల్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎఐఎం కార్యకర్తల మధ్య పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న పివి.సునీల్ కుమార్‌కు దళితులంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు సరికావు

కృష్ణంరాజుపై పోలీస్‌స్టేషన్లలో తెలుగు మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

అమరావతి మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఆదివారం ఫిర్యాదు చేశారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, పగడం సౌభాగ్యవతి, గుళ్లపూడి శ్రీదేవి, బురుజు ఉమామహేశ్వరి, పీసుపాటి రామలక్ష్మి, జనసేన వీర మహిళలు రాజీ, మారిశెట్టి బాలచిట్టెమ్మ, తానిగడప సుమలత, పంపాని మంగేశ్వరి, కోడిదాసు లక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : జిల్లా తెలుగుదేశం పార్టీకి చెందిన తెలుగు మహిళ ఆధ్వర్యంలో ఏలూరు సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సాక్షి ప్రతులను జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం ఏలూరు తెలుగు మహిళ ఆధ్వర్యంలో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కృష్ణంరాజు, కొమ్మిన శ్రీనివాసరావులపై ఫిర్యాదు చేశారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో తెలుగు మహిళలు జర్నలిస్ట్ కృష్ణంరాజుపై ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నాయకురాలు గొల్లు దుర్గాదేవి మాట్లాడారు.

చాట్రాయి : టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు తిరుమాని గోపాలకృష్ణ, కొక్కిలిగడ్డ ఈశ్వర పరశురాముడు, కోకా తాతయ్య పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్. నెం. 227/2015

బిట్వీన్:
పువ్వల శివరావు ...వాది
మరియు
పువ్వల సావిత్రి (Died) మరియు వగైరాలు ...ప్రతివాదులు

మీరు అనగా 7వ ప్రతివాది తేతలి నాగాంజలి, భర్త: అప్పలస్వామి, బోదిగట్టు, తాడేపల్లిగూడెం అను వారు పై నెంబరు గ్రంథములో ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ తీసుకొనక నిరాకరించు చున్నారు. గాన మీరు ది. 16-06-2025వ సం.రం ఉదయం గం. 10-30 ని॥లకు లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలుపుకోవలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పి. ఆంజనేయరాజు
అడ్వకేటు
తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం
సెల్: 98480 18256

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, జంగారెడ్డిగూడెం
O.S.No.183/2021
1.Sri Shaik Mahaboobjani ...Petitioner/Plaintiff
Vs
2.Sri Tiparthi Gruha Murthy ...Respondent/Defendant
టు:
ప్రతివాది : తిపర్తి గృహమూర్తి, సుబ్రహ్మణ్యం, గ్రామపంచాయతీ, ఉద్యోగి, కొప్పర్రు గ్రామం, నరసాపురం మండలం, పశ్చమ గోదావరి జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీకోర్టు వారు మీకు దావా సమన్లు రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను ఎన్నిమార్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున శ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, జంగారెడ్డిగూడెం వారి అనుమతితో పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. ది.16-06-2025 తేది సమయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపున న్యాయవాది వారి ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

కోర్టు వారి అనుమతితో
మోడేపల్లి నాగులు, న్యాయవాది,
జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
తేది.08-06-2025 సెల్: 9640719598

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.
A.A.C.F.No.76/2024
Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
Gudey Lakshmi Bhavani and Others ...Respondents/Opponents.
Opp3: Yadavalli Siva Ranga Rao, S/o.Nageswara Rao, Hindu, Male, a/a 51 Yrs, D.No.1-72, Ramalayam Street, Pedavegi Mdl. Koppaka, West Godavari Dist. Pin.534003. O/o Pilot Aurobindo Emergency Medical Services Eluru.
Opp5: Botcha Aswani Kumar, S/o.Samba Siva Rao, Hindu, Male, a/a 38 Yrs, D.No.2-115/1, 3rd Line Gandhi Nagar, Hanuman Junction, Pin;521105.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP3 & OP5 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.24-06-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 24-06-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్ప్యూటెంట్
E.SRINIVASA BABU
Advocate, Eluru.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.
A.A.C.F.No.13/2022
Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
S.T.P.Madhavi and Others ...Respondents/Opponents.
Opp2: Merajothu Hanuma Kumar, S/o.Jagan Naik, Hindu, Male, a/a 41 yrs, D.No.16B-10-14 , Lankapeta, 4th Road, Tangeliamudi Beside New Ramalayam, Eluru, West Godavari District, Pin.535005. O/o.School, As School Assistant, Hindu, Subbamma Devi Municipal High School, Eluru.
Opp4: Katta Venkata Narasamma, W/o.Venkateswara Rao, Hindu, Male, a/a 59 Yrs, D.No.2-5-53, N.R.Pet, Near Reliance Office Eluru, West Godavari District, Pin.535002, O/o.Office Sub oridante Accounts Officer Cheif Plainning Office Collectorate West Godavari, Eluru.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP2 & OP4 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.24-06-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 24-06-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్ప్యూటెంట్
E.SRINIVASA BABU
Advocate, Eluru.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.
A.A.C.F.No.75/2024
Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
B.Soma Raju and Others ...Respondents/Opponents.
Opp1: Bangaru Somaraju, S/o.Suryanarayana, Hindu, Male, a/a 34 Yrs, D.No.2-5, Varigedu, West Godavari, Andhra Pradesh, Pin:534225.
Opp2: Vaddadi Durga Bhavani, W/o.Eswara Rao, Hindu, Female, a/a 38 Yrs, D.No.14-10-8 Pension Line Back side Pasuvula Hospital, Eluru Mandalam, 11th Division Eluru, Pin:534005. O/o PH Worker in public Health Section Municipal Corporation, Eluru.
Opp4: Samanthula Sankara Rao, W/o.Lakshmana Swamy, Hindu, Male, a/a 42 Yrs, D.No.13-4-3/2, Railway Quarters Near Railway station Railway colony, Eluru. Pin: 534005. O/o.Track maintainer TRACK MNTR II SCR Vijayawada.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP1,2,4 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.24-06-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 24-06-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్ప్యూటెంట్
E.SRINIVASA BABU
Advocate, Eluru.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.
A.A.C.F.No.18/2022
Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
Ch.Anitha Venkata Lakshmi and Others ...Respondents/Opponents.
Opp1: Chinta Anitha Venkata Lakshmi, W/o.Syam Kumar, Hindu, Female, a/a 42 Yrs, D.No.16-111, Maha Lakshmi Nilayam, Vidya Nagar, Eluru, West Godavari District. Pin.534007.
Opp2: Damisetty Veerabadra Rama Rao, S/o.Dharma Rao, Hindu, Male, a/a 38 Yrs, D.No.04-3-20/2, KB Singh Road, N.R.Pet, Eluru, West Godavari Dist. Pin.534006. O/o.Police Conistable EMP ID 4530 PC.461, Intelligence Department, A.P., Vijayawada.
Opp4: Sangadala Nirmala, W/o.Kampa Ravi Prasad, Hindu, Female, a/a 48 Yrs, D.No.1-8, ST Colony, Lakkavaram, Jangareddygudem, West Godavari District. Pin.534451. O/o.Senior Assistant EMP ID.1101960 District Educational Officer, West Godavari, Eluru.
Opp5: Paladugu Venkata Veera Bhaskar, S/o.Venkateswara Rao, Hindu, Male, a/a 57 yrs, R/o.D.No.23B-4-31, RR Pet Subbamma Devi School Road, Eluru, West Godavari District. Pin.534002.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP1,2,4,5 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.24-06-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 24-06-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్ప్యూటెంట్
E.SRINIVASA BABU
Advocate, Eluru.